

ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, అల్లూరి సీతా రామరాజు జిల్లాల్లోని తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఉప ఎన్నికకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించిన మేరకు షెడ్యూల్ ప్రకారం ఈ నెల ఐదో తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ విషయంలో ఏలూరు జిల్లాలో ఐదో తేదిన పని చేసే అన్ని ప్రయివేట్ మేనేజ్మెంట్లు, అథారిటీలు తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గంలో నమోదైన ఓటర్లుగా ఉన్న తమ ఉద్యోగులకు, కార్మికులకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా కల్పించాలని తెలిపారు.

విద్యుత్ బిల్లుల మోత..!

ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల బాదుడు

వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం


డిసెంబర్ బిల్లులో రూ.150 నుంచి రూ.350 వరకూ పెరుగుదల

సామాన్య ప్రజానీకం విలవిల

జనవరి నుంచి మరో బాదుడుకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ బిల్లులు చూసి జనం షాక్‌కు గురవుతున్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం జనంపై పెనుభారం మోపింది. గత నెల బిల్లుకంటే విద్యుత్ వాడకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.350 వరకూ అదనంగా వచ్చిన పరిస్థితి ఉంది. డిసెంబర్ రెండో తేదీ నుంచి విద్యుత్‌శాఖ కరెంటు బిల్లులు తీస్తుంది. ఆ బిల్లులు చూసి సామాన్యులు హడలిపోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్ భారాలు మోపుతూ విశ్వరూపం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలుపెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానివే. రెక్కాడితేగాని, డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జి, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది.



SCNO	1511066102071739
NAME	SOMBA LOKARA..
ADDR	ZONE 5
CAT :1	PH :1
SCAT : LT Domestic - Domestic	
CONTRACTED LOAD	1.0KW
CONNECTED LOAD	1.0KW
MNo	6688242 MF:1.0
READING	MONTH STS
PRES KWH	4625 02-12-2024 1
PREV KWH	4454 03-11-2024 1
AVG UNITS	166
BILLED UNITS	171
RMD	1.86KVA
ENERGY CHRG	832.51
FIXED CHRG	10.00
CUST CHRG	50.00
ED	10.26
SURCHARGES	0.00
ED INT	0.00
TRUEUP CHRG	0.00
FPPCA CHRG	347.27
FPPCA2 CHRG	64.00
SHORTFALL	0.00
ACD SURCHRG	0.00
FAN INSTAL	0.00
ADJ AMOUNT	0.00
LOSS/GAIN	-0.04
BILL AMOUNT	1314.00
GOVT SUBSIDY	140.00
BILL AFT SUB	1174.00
ISD-TDS :	0.00
ARREARS	
BEF 01/04/24	0.00
	0.01
	1174.01
	16-12-2024
	01-01-2025

వాడుకున్న బిల్లు రూ.832 కాగా..అదనపు ఛార్జీలు రూ.342 వచ్చిన బిల్లు

ఏలూరులోని ఓ మధ్యతరగతి కుటుంబం నవంబర్‌లో 171 యూనిట్లు కరెంటు వాడుకోగా రూ.832.51 వచ్చింది. వాడుకుంటున్న కరెంటుకు కాకుండా అదనపు ఛార్జీ కింద మరో రూ.342 వేయడంతో విద్యుత్ బిల్లు రూ.1,174 వచ్చింది. వచ్చిన కరెంటు బిల్లును మూడొంతులుగా విభజిస్తే అందులో ఒకవంతు అదనపు ఛార్జీల భారమే ఉండటంతో ఆ కుటుంబం లబోదిబోమంటుంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండాపోయిందని వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరిని వెంటాడుతోంది. చిరువ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ఆ భారంసైతం జనాలపై పడనుంది. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన, ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయన్న చర్చ జనాల్లో సాగుతోంది.

ఆదాయాలు అంతంత మాత్రం.. ధరలు మాత్రం ఆకాశంలో..

సామాన్య ప్రజానీకం ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. నిత్యావసర వస్తువుల నుంచి కూరగాయల ధరల వరకూ అన్నింటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేసిన పరిస్థితి ఉంది. కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో దాదాపు రూ.150 వరకూ పలుకుతున్నాయి. వంటనూనె కిలో రూ.140కుపైగానే ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.50కిపైగా పలుకుతోంది. ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.80 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. మరోపక్క విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతోంది. పెను భారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం వెల్లువెత్తుతోంది. వైసిపి ఓటమికి ప్రధాన కారణం తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అదనపు ఛార్జీల పేరుతో రెండుసార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఒక్కసారిగా కరెంటు బిల్లు రూ.340 పెరిగింది

భానుమతి, ఏలూరు

గత నెల విద్యుత్ బిల్లుకంటే డిసెంబర్ రెండో తేదీన తీసిన విద్యుత్ బిల్లు రూ.342 ఎక్కువ వచ్చింది. ఒక్కసారిగా అంత పెరిగితే మధ్యతరగతి కుటుంబాలు ఎవిధంగా భరిస్తాయి. కరెంటు బిల్లు విషయంలో మాలాంటి మధ్యతరగతి కుటుంబాలు నలిగిపోతున్నాయి. ప్రభుత్వం అదనపు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి.

అదనపు ఛార్జీలు భరించలేకపోతున్నాం

వరలక్ష్మి, ఏలూరు

వాడుకున్న కరెంటు కంటే అదనపు ఛార్జీల భారంతో నలిగిపోతున్నాం. అనేక ఛార్జీల పేరుతో భారం వేస్తున్నారు. గత నెల బిల్లుకంటే ఈ నెల బిల్లులో రూ.వంద వరకూ అదనపు ఛార్జీల భారం పడింది. అదనపు ఛార్జీలు భరించలేని స్థాయికి చేరాయి. ప్రభుత్వాలు మారినా భారాలు మాత్రం తగ్గలేదు. ఇలాగైతే సామాన్యులు ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - పోలవరం




నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ నాణ్యమైన కరెంటు ఇవ్వడంతోపాటు విద్యుత్ ఛార్జీల తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి మాట మార్చి భారాలు మోపడం సిగ్గుచేటన్నారు. ట్రూఅప్, సర్‌ఛార్జీ, ఇందన సర్దుబాటు ఛార్జీలు పేరిట భారాలు మోపడం దారుణమన్నారు. పెంచిన ఛార్జీలు రద్దు చేయడంతోపాటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు బొరగం భూచంద్రరావు, తామా బాలరాజు, సముద్రాల సాయికృష్ణ, గంగాదేవి, రాజు, లక్ష్మి పాల్గొన్నారు.

గోపీమూర్తిని ఎంఎల్‌సిగా గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


జీలుగుమిల్లి : ప్రచారం చేస్తున్న నేతలు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జీలుగుమిల్లి, మడకం వారిగూడెం, అంకన్నగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉపాధ్యాయులు తమ సమస్యలపై నిరంతరం పోరాడే వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యతా ఓటు గోపీమూర్తికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావు, భవానిశంకర్, సోమేశ్వరరావు, రమాదేవి, పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నిడమర్రు, పెదనిండ్రకొలను, మందలపర్రు గ్రామాల్లో ఉపాధ్యాయులను ప్రజాసంఘాల నేతలు కలిసి కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, యుటిఎఫ్ నాయకులు ఎస్‌కె.మౌలాలి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, పిఆర్‌సి అమలుకు నిరంతరం పోరాడిన వ్యక్తి గోపీమూర్తి అన్నారు. అటువంటి నేతను మండలికి పంపితే చట్టసభల్లో ఉపాధ్యాయుల గళం విన్పించే అవకాశం ఉంటుందని, అందువల్ల గోపీమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కోనా శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో ఆళ్ల నాని చేరికకు బ్రేక్..!

నాని చేతిక యత్నాలపై భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

డైలమాలో టిడిపి అధిష్టానం!

ప్రస్తుతానికి నాని చేరికను పక్కన పెట్టారని ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



మాజీ మంత్రి ఆళ్ల నాని టిడిపిలో చేరికకు బ్రేక్ పడింది. మంగళవారం ఆయన చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. హఠాత్తుగా ఆ ప్రక్రియ ఆగిపోవడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అందుకు ప్రధాన కారణం ఏలూరులోని టిడిపి నేతలు, కార్యకర్తలు ఆళ్ల నాని చేరికను తీవ్రంగా వ్యతిరేకించడమేనని తెలుస్తోంది. వైసిపిలో కీలకనేతగా ఆళ్ల నాని ఎదిగారు. 2019 ఎన్నికల్లో ఏలూరు ఎంఎల్‌ఎగా గెలుపొందడమే కాకుండా, వైసిపి ప్రభుత్వంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా పని చేశారు. గత ఎన్నికల్లో వైసిపి నుంచి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగిన ఆళ్ల నాని ఘోర ఓటమి చవిచూశారు. ఏలూరు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 60 వేలకుపైగా ఓట్లు తేడాతో టిడిపి అభ్యర్థి బడేటి చంటి చేతిలో ఓటమి చవిచూశారు. తర్వాత ఆయన వైసిపి జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. ఏలూరు ఎంఎల్‌ఎగా, మంత్రిగా ఉన్న సమయంలో ఏలూరులోని టిడిపి నేతలను, కార్యకర్తలను ఆళ్ల నాని తీవ్రంగా ఇబ్బందులు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. ఆళ్ల నాని మంగళవారం చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరుతున్నట్లు తెలియడంతో టిడిపి నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. నాని అధికారంలో ఉండగా టిడిపి నేతలకు సంబంధించి కూల్చిన ఇళ్లు, దుకాణాల ఫొటోలతోపాటు, గాయపడి ఆసుపత్రిలో చేరిన వ్యక్తుల ఫొటోలు సోషల్ మీడియాలో పెద్దఎత్తున వైరల్ అయ్యాయి. ఆళ్ల నానిని టిడిపిలో చేర్చుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. ఆళ్ల నాని చేరికపై మాట్లాడేందుకు ఏలూరు జిల్లాకు చెందిన ఎంఎల్‌ఎలంతా అందుబాటులో ఉండాలని సోమవారం రాత్రి టిడిపి అధిష్టానం నుంచి పిలుపు వచ్చినట్లు సమాచారం. ఎంఎల్‌ఎలతో మాట్లాడిన తర్వాత మంగళవారం మధ్యాహ్నం ఆళ్ల నాని టిడిపిలో చేరతారనే ప్రచారం సాగింది. ఆళ్ల నాని చేరికను ఎంఎల్‌ఎలు సైతం వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఏలూరు నియోజకవర్గంలో పరిస్థితి అధిష్టానానికి చేరడంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. మొన్నటి వరకూ ఆళ్ల నానిపై పోరాడితే.. ఇప్పుడు ఆయన్ని పార్టీలో ఏవిధంగా చేర్చుకుంటారనే అభిప్రాయం తెలుగు తమ్ముళ్లలో ఉంది. ఆళ్ల నాని టిడిపిలో చేరతారా.. లేక పక్కన పెట్టేసినట్లేనా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది..

ప్రచారానికి తెర

5న టీచర్స్ ఎంఎల్‌సి పోలింగ్

వ్యూహ ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు

బరిలో పిడిఎఫ్ అభ్యర్థిగా గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ప్రచారానికి మంగళవారం సాయంత్రం 5 గంటలతో తెర పడింది. ప్రచారం ముగియడంతో వ్యూహ ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 5న పోలింగ్ జరుగనుంది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గతంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉన్న షేక్ సాబ్జీ అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో నిలిచారు. సాబ్జీ స్థానంలో పిడిఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపిమూర్తి పోటీలో ఉన్నారు. మరో ఐదుగురు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. వీరిలో రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం గ్రామానికి చెందిన గంధం నారాయణరావుకు వైసిపి నేతలు కొందరు పరోక్షంగా మద్దతుగా ఉన్నారు. కూటమి సర్కారు ఈ ఎన్నికల్లో ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేయాలనే స్పృహ పెంచాలి

ప్రాణదాతలకు నగదు ప్రోత్సాహకం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ఉపయోగించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత నెలలో హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన తనిఖీల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. రవాణా, పోలీస్ శాఖలు కలిసి ఆరు వేలకుపైగా కేసులు నమోదు చేసి రూ.14.25 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. హెల్మెట్ ఉపయోగించడంపై జిల్లా అధికారులు, కళాశాలల్లో విద్యార్థులకు, వివిధ తరగతుల ప్రజలకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. హిట్ అండ్ రన్‌కు సంబంధించిన 46 కేసులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన వివిధ అంశాల పరిష్కార తీరును సమీక్షించారు. గుడ్ సమరిటన్స్ చట్ట ప్రకారం ప్రమాద బాధితులను సకాలంలో కాపాడిన వారిని సత్కరించడంతోపాటు నగదు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో సహాయం చేసే వారికి పోలీసుల నుండి భద్రత కల్పించడంతోపాటు సివిల్, క్రిమినల్ కేసుల వంటివి ఉండవని, హాస్పిటల్ వద్ద వేచి ఉండాల్సిన అవసరం కూడా ఉండదని అన్నారు. దీనిపై అందరిలో అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌టిసి బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా సంబంధిత డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారికి ఆనుకుని అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను గుర్తించి రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గుర్తించిన 33 బ్లాక్‌స్పాట్స్‌లో తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తరచూ పోలీసు, రవాణా, ఎన్‌హెచ్ తదితర అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ కలెక్టర్ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసి శబ్ద కాలుష్యానికి గురి చేసే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సైలెన్సర్‌లను తొలగించే మెకానిక్‌లపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాలల యాజమాన్యాలు హెల్మెట్ ధరించకుండా కళాశాలకు ద్విచక్ర వాహనంపై వచ్చే విద్యార్థులకు ప్రవేశం నిషేధించాలని సూచించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ కరీం, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ జాన్‌మోషే, డిఎంహెచ్‌ఒ ఎస్.శర్మిష్ఠా, డిసిహెచ్‌ఎస్ పాల్ సతీష్, జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్లు, రవాణా శాఖాధికారులు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై..

ప్రభుత్వం తొండాట..!

మళ్లీ వాయిదా పడ్డ ఎన్నికలు

మొన్న అసెంబ్లీ, ఇప్పుడు తుపాను పేరుతో వాయిదా

ఎన్నికలు జరిపే ఉద్దేశం ఉందా అంటూ రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకటించిన తర్వాత రెండుసార్లు ఎన్నికలు వాయిదా పడటంపై రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. తొలుత నవంబర్ 21న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 20వ తేదీ వరకూ ఎటువంటి ప్రకటనా చేయకుండా అప్పటికప్పుడు అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అప్పటికే ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తర్వాత డిసెంబర్ ఐదో తేదీన సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అని, ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయాల్సిన తరుణంలో తుపాను కారణంగా ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు మంగళవారం తెలిపింది. దీంతో గ్రామాల్లో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే ఆలోచన ఉందా అంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల పేరుతో ప్రభుత్వం రైతులతో తొండాట ఆడుతోందని సర్వత్రా చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో మేజర్, మీడియం మైనర్ మొత్తం 354 వాటర్ యూజర్స్ అసోసియేషన్ల ప్రాదేశిక నియోజకవర్గాలను గుర్తించారు. ఈ పరిధిలో మొత్తం 2,31,311 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. వీటికి ఎన్నికలు నిర్వహించి 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, రెండు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. పశ్చిమలో మేజర్ 98, మైనర్ 14 మొత్తం 112 వాటర్ యూజర్స్ అసోసియేషన్ల ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిపి 14 వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొత్తం 3.29 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిపిఎం 26వ జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి, నేతలు

సిపిఎం 26వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడేళ్లకోసారి జరిగే జిల్లా మహాసభ మొట్టమొదటిసారిగా పోరాటాల కేంద్రమైన బుట్టాయగూడెంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ పోరాటాలు ఆరంభించి 30 ఏళ్లు కావస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ చట్టాల రక్షణ కోసం అనేక పోరాటాల కేంద్రమైన బుట్టాయగూడెంలో నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ మహాసభకు ప్రజలంతా సహకరిస్తున్నారన్నారు. మొదటి రోజైన 13వ తేదీన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం వస్తున్నారని, ప్రజలు పెద్దఎత్తు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


ఉంగుటూరు : వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి తగ్గించాలని మండలంలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు జాబ్ చార్ట్ లేక ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. సచివాలయాల్లో పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒను కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆధాం, జెస్సీ, సత్యనారాయణ కన్నయ్య, మల్లికార్జునరావు, రేవతి, శ్రీరాములు, మంగతాయారు పాల్గొన్నారు.

ఉంగుటూరు :పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని ఉంగుటూరు ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. మండలంలో 27 గ్రామాలకు చెందిన కార్యదర్శులు మాట్లాడుతూ అనేక ఒత్తిళ్లతో పనిభారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని జాబ్ చార్టు మేరకే విధులు అప్పగించి మిగతా పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యదర్శులు బివి.రవిచంద్రకుమార్, నీలం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొంటాం : జెసి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


రైతులతో మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. మంగళవారం మండలంలోని నారాయణపురం రైతుసేవా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ మధ్య దళారుల మోసపూరిత మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని రైతులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా రైతులను మభ్యపెట్టి మధ్యవర్తులు అక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ తీరుతెన్నులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రెవెన్యూ సిబ్బంది సహకారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తేమశాతం 17 లోపు వచ్చేవరకు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని జెసి సూచించారు. రైతులకు ఏ సమయంలోనైనా, ఏ విధమైన సహకారం కావాలన్నా జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. జెసి వెంట తహశీల్దార్ కెవి.సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి రమేష్, గ్రామ సర్పంచి కేతా నాగ సుబ్రహ్మణ్యం, విఆర్‌ఒ కార్తీక్, రైతుసేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ వాహనాలపై పరిశోధనలు విస్తృతం చేయాలి

ఎన్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటరెడ్డి

విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరగనున్న దృష్ట్యా అధ్యాపకులు విద్యుత్ వాహనాలపై పరిశోధనలను విస్తృతంగా చేయాలని ఎన్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు అన్నారు. మండల పరిధిలోని పోతవరప్పాడు గ్రామంలో ఉన్న ఎన్ఆర్ఐ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ఎఐసిటిఇ అటల్ ప్రాయోజిత అధునాతన స్థాయి అధ్యాపక నైపుణ్యాభివృద్ధి సదస్సును ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్, హెచ్ఒడి ఇఇఇఎన్‌టియు యూనివర్శిటీ కాకినాడకు చెందిన డాక్టర్ కె.వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలక్ట్రికల్ వాహనాల్లో ఎలా ఉపయోగించాల్లో వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.కైలాసరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

ఇండస్ట్రియల్ ఏర్పాటుపై, మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో అభివృద్ధి కోసం మెగా పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహల్లో భాగంగా సిఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ భేటీ అయినట్లు ఆయన తెలిపారు. ఆ ప్రతిపాదనపై నీరబ్‌కుమార్‌ప్రసాద్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం తదుపరి చర్యలకు ఆదేశం చేసినట్లు తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.సుమలత అన్నారు. మండలంలోని బంధంచర్ల, కేతవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించారు.

జీలుగుమిల్లి : మినుము, మొక్కజొన్న, పెసర పండించే రైతులు పంట బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి కె.గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని పి.రాజవరం రైతు సేవ కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి నవీనతో కలిసి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోర బాలిక వికాసం 2.0పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

దాతల సాయం అభినందనీయం

భీమడోలు : గుండుగొలను గ్రామానికి చెందిన విద్యార్థి ఎ.చైతన్యకృష్ణ వైద్య సహాయం నిమిత్తం దాతలు ముందుకు రావడం అభినందనీయమని స్థానిక వాట్సాప్ గ్రూపునకు చెందిన టి.సుమన్, కె.దిలీప్ తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న చైతన్య కృష్ణకు గత నాలుగేళ్ల కాలంగా చికిత్స కొనసాగుతుంది. అతని వైద్యానికి సుమారు రూ.ఏడు లక్షల వరకు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. నిరుపేదలైన అతని తల్లిదండ్రులు తమ వద్ద ఉన్నదంతా ఖర్చు చేశారు. దాతలను సహాయాన్ని కోరారు. దీనిపై స్పందించిన ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు చొరవ తీసుకొని సిఎం సహాయనిధి నుంచి రూ.2.48 లక్షల మంజూరుకు సిఫార్సు చేశారు. ఈ మేరకు మంజూరైన అనుమతి పత్రాన్ని అతని కుటుంబ సభ్యులకు అందించారు. వైద్యానికి సుమారు రూ.ఏడు లక్షలు అవసరం కావడంతో మిగిలిన మొత్తంలో కనీసం రూ.లక్ష గుండుగొలను వాట్సాప్ గ్రూపు ద్వారా అందించేందుకు సదరు గ్రూపు సభ్యులు ముందుకు వచ్చారు. నిరంతరంగా దాతల సహకారాన్ని అందించారు. వారు అందించిన సహకారాన్ని పారదర్శకంగా అందరికీ తెలిసే విధంగా సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. ఈ క్రమంలో ఇంతవరకు ఈ విధంగా వారు సేకరించిన మొత్తాలను చైతన్యకృష్ణకు మంగళవారం అతని నివాసగృహం వద్ద అందించారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీ కొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లి మండలం గురజ గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీను సోమవారం సాయంత్రం మండలంలోని కానుకొల్లు నుంచి బైక్‌పై ముదినేపల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముదినేపల్లి నుంచి కైకలూరు వైపు వస్తున్న ఆటో, బైక్ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలోశ్రీనుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు దేవరకొండ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కొయ్యలగూడెం : మండలంలోని గవరవరం గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 20 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,23,130 నగదు, ఐదు మోటార్‌సైకిళ్లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

చాట్రాయి : స్థానిక చాట్రాయి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ డి.రామకష్ణ తెలిపిన సమాచారం మేరకు మండలంలోని పర్వతాపురం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.26,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జరిమానా, జైలు శిక్ష

నూజివీడు టౌన్ : అప్పు తీర్చడానికి ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి పెదపాడు మండలం అందేకానిచెరువు గ్రామానికి చెందిన నత్త ఆదాముకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.నాలుగు లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాల ప్రకారం.. మండలం దిగువల్లి గ్రామానికి చెందిన బర్రె శ్రీనివాసరావు 2015లో ఆదాముకు రూ.ఐదు లక్షల అప్పు ఇచ్చారు. కొంతకాలం తర్వాత బాకీ చెల్లించమని శ్రీనివాసరావు అడుగగా ఆదాము రూ.మూడు లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఆదాము అకౌంట్లో నగదు లేదని తిరిగి వచ్చింది. దీనిపై శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం న్యాయమూర్తి జైలు శిక్ష జరిమానా విధించారు.

వరకట్న వేధింపుల కేసులో భర్తకు జైలు, జరిమానా

ఏలూరు స్పోర్ట్స్ : వరకట్న వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధించారు. వివరాల ప్రకారం... నగరంలోని మూడో పట్టణ ప్రాంతానికి చెందిన రెడ్డి సాయి సత్య రాఘవేంద్రరావు అతని రెడ్డి చంద్రప్రియను వరకట్న వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో చంద్రప్రియ 2022లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో మంగళవారం రెడ్డి సాయి సత్య రాఘవేంద్రరావుకు ఏడాది జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానాన్ని కూడా విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యక్తిపై దాడి : ఒకరిపై కేసు నమోదు

టి.నరసాపురం : వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన నత్తా నాగరాజుకు అదే గ్రామానికి చెందిన గుమ్మళ్ల స్వామికి గత కొంత కాలంగా ఇంటిస్థలం విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల రెండో నాగరాజు స్థానిక సచివాలయం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా గుమ్మళ్ల స్వామి ఇంటి సమీపంలోకి వచ్చేసరికి నా ఇంటి వద్ద చేతబడి చేయిస్తావా అంటూ తన వద్ద ఉన్న కత్తితో నాగరాజు తలపై దాడి చేశాడు. గాయాలపాలైన నాగరాజును బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని భార్య నత్తా సుజానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల్లో మనోధైర్యం నింపాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతున్న కలెక్టర్

విభిన్న ప్రతిభావంతులను అందరితో సమానంగా భావించి వారిలో మనోధైర్యం నింపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయి వేడుకలు మంగళవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నెలలో నాలుగో శనివారం వికలాంగుల కమిటీ మీటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వికలాంగులతో కలిసి కలెక్టర్ కేకును కట్ చేశారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు, వివిధ కళలు ప్రదర్శించిన వారికి కలెక్టర్ బహుమతులు అందించారు.

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శనివారపుపేట, దొండపాడులోని విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడారు. డిజేబుల్ ఎడి బి.రామ్‌కుమార్, ప్రవర్తన విభిన్న ప్రతిభావంతల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : వికలాంగ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వం ద్వారా అందించే రాయితీలను పొందాలని ఆగిరిపల్లి ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి భవిత కేంద్రంలో మంగళవారం వికలాంగులకు ఆటల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. మండల వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల పోరాట సమితి సభ్యులను గ్రామస్తులు సన్మానించారు.

మండవల్లి : లోకుముడి ఎంపిపి పాఠశాలలో భవిత, స్పెషల్ పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో ఎంఇఒ-1 రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూచిపూడి నృత్య కళాకారుని దివ్యల జూషిత నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులను అందించారు

ముసునూరు : ముసునూరు ఎంపిపి పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మాట్లాడారు. అనంతరం భవిత కేంద్రానికి వస్తున్న నడవలేని పిల్లల కోసం సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది వీల్ ఛైర్‌ను అందించారు.

భీమడోలు : విభిన్న ప్రతిభావంతులు సైతం ఇతరులతో సమానమన్న భావన వారికి కలిగించి, వారి అభ్యున్నతికి సహకరించాలని భీమడోలు ఎంఇఒ భాస్కర్‌కుమార్ కోరారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలు భవిత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు హైస్కూల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు. అధ్యక్షత వహించారు. అనంతరం భవిత విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించిన దాత పి.గంగాధరరావు, ప్లాస్టిక్ నీళ్ల బాటిల్స్ అందించిన దాత ఝాన్సీతో పాటు ఇతర వస్తువులు అందించిన దాతలను అభినందించారు.



శుభ్రపర్చిన వాటర్‌ట్యాంకు

వాటర్‌ట్యాంకు శుభ్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని మేతిమెల్లివారిగూడెంలో వాటర్ ట్యాంకును అధికారులు శుభ్రం చేయించారు. వాటర్ ట్యాంక్ శుభ్రం చేయండి మహాప్రభో శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. మంగళవారం వాటర్‌ట్యాంకు శుభ్రం చేయించి పైపు లికేజీ అవ్వకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - మండవల్లి

కంటి చూపులో తలెత్తే సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చూపును కోల్పోవాల్సి వస్తుందని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీమతి శశికళ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు గుడివాడ దాత ఎఆర్‌కె.చౌదరి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు.

కిశోర బాలిక వికాసం

భీమడోలు : గ్రామస్థాయిలో కిశోర బాలిక వికాసం కార్యక్రమాన్ని ప్రతి నెల రెండు, నాలుగో శనివారాల్లో అంగనవాడీ కేంద్రాలు వేదికగా నిర్వహించాలని సదరు కమిటీలకు భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కిశోర బాలిక వికాసం కార్యక్రమం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థాయి కమిటీలకు ప్రాతినిధ్యం వహించే కన్వీనర్ గ్రామ పంచాయతీకి చెందిన మహిళా సంరక్షణ అధికారితో పాటు సభ్యులుగా వ్యవహరించే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఒకరు, కార్యకర్త అంగన్వాడీ కేంద్రానికి చెందిన కార్యకర్తలు హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎకు మంగళవారం ప్రజలు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు.

పంటకు బీమా చేయించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ మినుము పైరుకు బీమా చేయించుకోవాలని ఎడిఎ జి.వెంకటమణి కోరారు. మండలంలోని కోడూరు, పెదపాలపర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

చిన్నారి దశ నుంచే సైబర్ నేరాల పట్ల అవగాహన ఉంటే వారిద్వారా వారి కుటుంబ సభ్యులు కూడా సైబర్ నేరాల బారిన పడకుండా ఉంటారనే దృఢ సంకల్పంతో చిన్నారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని ఏలూరు సైబర్ సెల్ ఎస్ఐ మధు వెంకటరాజా అన్నారు. నగరంలోని సురేష్ బహుగుణ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ సెల్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

దుప్పట్లు, బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - కలిదిండి

ఆంధ్రా - తెలంగాణా రాధా రంగా మిత్ర మండలి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పన్నాస పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 150 మంది వృద్ధులకు దుప్పట్లు, పారిశుధ్య కార్మికుల కుటుంబానికి ఐదు కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందచేశారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

సొసైటీ తరపున ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులు దుబ్బాక జగ్జీవన్‌రావు ఇటీవల మరణించారు. మృతుని భార్య దుబ్బాక ఝాన్సీ లక్ష్మికి నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నీలం నాగేశ్వరరావు చేతుల మీదుగా మట్టిఖర్చుల నిమిత్తం రూ.పది వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ సిబ్బంది సోమశేఖరరావు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



స్థలం పరిశీలిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

మండలంలో మోడల్ సోలార్ విలేజ్ అయిన ద్వారకాతిరుమలలో మొట్టమొదటిగా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వారి ఆధ్వర్యంలో పైలట్ సోలార్ ప్రాజెక్ట్ కింద 750 కెడబ్ల్యూపి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే స్థలాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎపిఇపిడిసి ఎల్ పర్యవేక్షక ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు, ఇఇ ఆపరేషన్ కెఎం.అంబేద్కర్, ఇతర విద్యుత్ అధికారులు ఆమెకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు వివరాలు తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు అధ్యక్షతన పిఎం సూర్య ఘర్ యోజన పథకంపై గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఇ కన్స్ట్రక్షన్ టి.శశిధర్, డిప్యూటీ ఇఇ ఆపరేషన్ కె.గోపాలకృష్ణ, సోలార్ వెండర్స్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎఐఎస్ఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



ధర్నా నిర్వహిస్తున్న ఎఐఎస్ఎఫ్ నేతలు

నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ ఈ మేరకు నూజివీడులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.శివకుమార్ మాట్లాడుతూ నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో వందలాదిమంది పేద విద్యార్థులు ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతూ అధిక ఫీజులు కట్టలేక విద్యను మధ్యలో ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడులో తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించి పేద విద్యార్థులను ఆదుకోవాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సాయి కుమార్, విద్యార్థులు, పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జి తెలుగు న్యూస్ విలేకరిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి దాడికి పాల్పడిన వారిని ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. దాడులకు పాల్పడమని, దౌర్జన్యాలు చేయబోమని, శాంతి భద్రతలు కాపాడుతామని చెబుతున్న కూటమి ప్రభుత్వం అందులో ఉన్న జనసేన పార్టీ కూడా ఈ వ్యవహారంపై ఆలోచించాలని పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం

కొయ్యలగూడెంలో సోమవారం పాత్రికేయుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సత్యనారాయణకు డిఎన్ఆర్ పరామర్శ



సత్యనారాయణను పరామర్శిస్తున్న డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు స్వామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణను ముదినేపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. సత్యనారాయణ మాతృమూర్తి వెంకమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న దూలం నాగేశ్వరరావు వైసిపి నాయకులతో కలిసి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, అల్లూరు సర్పంచి శీలం రామకృష్ణ, పార్టీ నాయకులు అల్లాడ సతీష్, మరీదు వసంతరావు, పుట్టి సుబ్బారావు, రంగిశెట్టి కొండ, మీసాల రామకృష్ణ, ప్రభు, దోసనపూడి దాసు తదితరులు సత్యనారాయణను పరామర్శించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా

ఎంఎల్ఎ ధర్మరాజు


ప్రజాశక్తి - భీమడోలు



గుండుగొలనులో పర్యటిస్తున్న ఎంఎల్ఎ

గుండుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. ఆయన గుండుగొలనులో మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా నత్త నడకన నడుస్తున్న గోదావరి కాలువ పై వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం గుండుగొలను హైస్కూల్‌కు చేరుకున్న ఎంఎల్ఎకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలోని ఉపాధ్యాయ బృందం స్వాగతం పలికింది. ఎంఎల్ఎ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన ప్రముఖులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల అభివద్ధి కోసం వారి సూచనలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేశారు. భవన నిర్మాణం గురించి ఆరా తీసిన ఎంఎల్ఎ సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడారు.

పొజిషన్ సర్టిఫికెట్లు అందించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సుందరయ్య కాలనీ ప్రాంతంలో నివసించే పేదల ఇళ్లకు పొజిషన్ సర్టిఫికేట్లు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆగిరిపల్లిలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లోన తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ బి.భార్గవికి సుందరయ్య కాలనీ ప్రాంత వాసులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, సుందరయ్య నగర్ కమీటీ సభ్యులు పామర్తి రాంబాబు, మల్లంపల్లి కృష్ణ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సారధి మన వారధి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 531 అర్జీలు స్వీకరించినట్లు ఎంపిడిఒ సి.రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమం బుధవారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎంప్లాయిస్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీ వాసులు మంగళవారం ఐదో వార్డు సచివాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సచివాలయ ఇన్‌ఛార్జి సిహెచ్.ప్రభాత్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎంప్లాయిస్ కాలనీలో తక్షణమే సీసీ డ్రెయిన్లు నిర్మించాలని, శానిటేషన్ మెరుగు పరచాలని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి పాముల బెడద నివారించాలని, పార్కులో వాకింగ్ ట్రాక్ పైకి గాలి రాకుండా పెరిగిన చెట్ల కొమ్మలు నరికించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ కాలనీ వాసులు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, సిహెచ్.ఆంజనేయులు, ఎండి.సుభాని, సత్యనారాయణ, పుల్లారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని భువనపల్లిలో ధాన్యం పట్టుబడి పడుతున్న రైతుల వద్దకు ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు వెళ్లి ధాన్యం కొనుగోలు విధానం , గోనె సంచుల అందజేత, డబ్బులు జమ వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతేరాజు అనే విధానంతో వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు.

న్యాయవాదుల దినోత్సవం

ప్రజాశక్తి - మండవల్లి

భారత తొలి రాష్ట్రపతి న్యాయవాది డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం న్యాయవాదుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యువ న్యాయవాది తణుకుల రవితేజ మాట్లాడారు. న్యాయవృత్తిలో తనకు మార్గదర్శకత్వం చూపిస్తున్న సీనియర్ నాయకులు పల్లె వెంకటేశ్వర్లు, అల్లూరి హేమంత్ కుమార్, ఉండవల్లి జగదీష్, కొట్టే రవికాంత్, నిర్మల, సాంబశివ ప్రతాప్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్యుమెంట్ పోయినది

బిరుదుకోట విజయలక్ష్మి, D/o.బిరుదుకోట రామమూర్తి అనునేను ది.21-11-2002న ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామములోని సింహాద్రినగర్‌లో తోలేటి రత్నాజీ, W/o.తోలేటి రామక్రిష్ణ వద్ద 231 చ.గజముల ఇంటి స్థలము కొనుగోలు చేసి భీమడోలు సబరిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించినాను. దాని తాలూకు లింక్ డాక్యుమెంటు భీమడోలు రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన నెం.3859/1999 డాక్యుమెంట్ నావద్ద మిస్ అయినది. కావున విచారణ చేసి నా డాక్యుమెంట్‌ను ఇప్పించవలసినదిగా కోరుచున్నాను.

బి.విజయలక్ష్మి - 9848481452

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

HMOP.54/2024

పిటీషనరు : సక్కు దుర్గ

Vs

రెస్పాండెంటు : సక్కు దుర్గారావు

To.

సక్కు దుర్గారావు, S/o.భద్రరావు,
బిజినెస్, H/o.సక్కు శ్రీనివాస్,
డోరునెం.C-101, Plot No.S6, L & T
Colony, Palakol, W.G.Dt.

మీపై మీ భార్య సక్కు దుర్గ విడాకుల నిమిత్తం పైకోర్టులో పిటీషను దాఖలు చేసి మీకు అనేకసార్లు నోటీసులు పంపించిననూ, సదరు నోటీసులు తీసుకొనక Avoid చేస్తూ వచ్చినారు. పైకోర్టు వారు Sustitute Service ద్వారా మీకు నోటీసు చేయు నిమిత్తం Publication జారీ చేస్తూ మీ హాజరు నిమిత్తం ది.9-12-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన మీరు స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గాని ఉదయం 10.00 గం॥లకు కోర్టుకు హాజరయి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిఎడల నీ పరోక్షమందు కోర్టు వారు తీర్పు చెబుతూ పిటీషనరుకు విడాకులు మంజూరు చేయుదురు.

G.M.Vallabha Rao
D.Chamundeswari
Narsapur
Dt.27-11-24 Advocates for Petitioner

మహారాజశ్రీ VII అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి మరియు ఫ్యామిలి కోర్టు, ప.గో.జిల్లా., ఏలూరు వారి కోర్టులో

O.S.No.18/2024

Between:
చౌదాడ అంజలి అన్నపర్ణ @ అన్నపూర్ణ
రిప్రజెంటెడ్ బై S.P.A హోల్డరు
శ్రీమతి గొర్రెల అరుణ ...వాది
మరియు
శ్రీమతి D.దేవి మరియు యితరులు
...ప్రతివాద్లు

To.

4వ ప్రతివాది :
బాలిబోయిన వెంకటేశ్వరరావు, S/o.సైదులు,
డోరునెం.7E-5-25/2, కత్తైపు వీధి,
వెంకన్న చెరువు, ఏలూరు.

పై దావాలో వాది అయిన చౌదాడ అంజలి అన్నపూర్ణ, ప్రతివాదులు 1 to 7 లపై దాఖలు చేసిన పై దావాలో 4వ ప్రతివాది మరియు I.A.472/2024, I.A.473/2024 పిటీషనులలో 4వ రెస్పాండెంటు అయిన బాలిబోయిన వెంకటేశ్వరరావు యొక్క హాజరు నిమిత్తం ది.**30-12-2024**వ తేదిన శ్రీకోర్టు వారు వాయిదా వేసినారు. పైదావా మరియు పిటీషనులు విషయమై 4వ ప్రతివాది / 4వ రెస్పాండెంటుకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి యెదుట హాజరై తెలుపు కొనవలెను. లేనియెడల వారి పరోక్షమున విచారించి, తీర్మానించెదరని యిందుమూలంగా తెలియజేయడమైనది.

ఏలూరు
తేది.30.11.24
కె.నాగేంద్రబాబు
వాది తరపు అడ్వకేటు,
ఏలూరు. సెల్:9505458999